# ఊరూరా వేముల ప్రచారం

## మోర్తాడ్, భీమ్‌గల్ మండలాల్లో ఘన స్వాగతం

మోర్తాడ్/ భీమ్‌గల్, నవంబర్ 4: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోర్తాడ్, భీమ్‌గల్ మండలాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. మోర్తాడ్ మండలంలోని సుంకెట్, దోన్‌పాల్, గాండ్లపేట్, భీమ్‌గల్ మండలం రూప్లాతండా, ఎంజీ తండా, బడాభీమ్‌గల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఏదో ఒకరూపంలో ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. ఆశీర్వదించి, సంక్షేమాలు అందుకోవాలని కోరారు. మోర్తాడ్ మండలం సుంకెట్, దోన్‌పాల్, గాండ్లపేట్ గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన మంత్రి వేములకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వలగొడుగు, బోనాలతో స్వాగతం పలికారు. పటాకులు కాల్చుతూ.. డ్యాన్సులు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. గాండ్లపేట్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ప్రచారంలో రాష్ట్ర రైతునాయకుడు కోటపాటి నర్సింహనాయుడు, ఎంపీపీ శివలింగుశ్రీనివాస్, జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, సర్పంచులు శ్రీనివాస్, పర్సదేవన్న, మామిడి సౌజన్య, ఎంపీటీసీలు కళావతి, అశోక్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ దేవన్న, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ పాపాయి పవన్, రాష్ట్ర విత్తన కమిటీ సభ్యుడు సంజీవ్‌రెడ్డి, మోత్కుభూమన్న, సత్యనారాయణ, చిన్నరాజేశ్వర్, ఇంతియాజ్, ఆరిఫ్, లక్ష్మణ్, గంగన్న, చిన్నారెడ్డి, కల్లెం అశోక్, దడివె నవీన్, రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా రూప్లాతండాలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

# అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ..


కమ్మర్‌పల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ లోలపు గౌతమి, బీఆర్ఎస్ మహిళా కార్యకర్తలు

కమ్మర్‌పల్లి/ మెండోరా/బాల్కొండ/ముప్కాల్/ వేల్పూర్, నవంబర్ 4: బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. అభివృద్ధిని చూసి వేములకు ఓటు వేయాలని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ లోలపు గౌతమీ సుమన్, మహిళా నాయకులు ప్రచారం నిర్వహించారు. మెండోరా మండలంలోని అన్ని గ్రామాల్లో

### జోరుగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో అనంతరం చేపట్టే కార్యక్రమాల మ్యానిఫెస్టో వివరాలను ప్రజలకు అందజేశారు. ప్రచారంలో సోన్‌పేట్, పోచంపాడ్ గ్రామాల సర్పంచులు గోలి ప్రకాశ్, మిస్బా, బీఆర్ఎస్ మండల నాయకులు సంజీవ్, పరమేశ్వర్, ఎర్ర భాస్కర్, రఘు, పాషా తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ , వేల్పూర్ మండల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రచారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, నవీన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వేల్పూర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ముప్కాల్ మండలం నల్లూర్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేస్తున్న పార్టీ నాయకులు

# గ్రామాల్లో పోలీసు కవాతు

కమ్మర్‌పల్లి, నవంబర్ 4: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా స్థానిక పోలీసులు.. కేంద్ర బలగాలైన రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి కమ్మర్‌పల్లితోపాటు ఉప్లూర్ గ్రామంలో శనివారం కవాతు నిర్వహించారు. హాసాకొత్తూర్ ఎక్స్‌రోడ్డు, కమ్మర్‌పల్లి మీదుగా ఉప్లూర్ గ్రామం వరకు కవాతు కొనసాగింది. ఎస్సై రాజశేఖర్, అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్ నాద్వెల్, ఇన్‌స్పెక్టర్ రాబిన్‌బాబు, శంకర్ పాల్గొన్నారు.

**తొర్తిలో..**

ఏర్గట్ల, నవంబర్ 4: మండలంలోని తొర్తి గ్రామంలో ఏర్గట్ల ఎస్సై మశ్చేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అదనపు బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో గ్రామస్తులు పాల్గొనాలని సూచించారు.

**ముప్కాల్‌లో..**

ముప్కాల్, నవంబర్ 4 : మండల కేంద్రంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీంతోపాటు స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై భాస్కరాచారి, ఏఎస్సై తొగర్ల సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


బాల్కొండలో కవాతు నిర్వహిస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్

## జీవాలకు టీకాల పంపిణీ


జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యసిబ్బంది

ముప్కాల్, నవంబర్ 4 : మండలంలోని నాగంపేట్ గ్రామంలో మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకాలను పశువైద్యాధికారులు శనివారం వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పీపీ ఆర్ టీకాలను గొల్లకుర్మలు తమ జీవాలకు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశుమిత్ర లక్ష్మి, గోపాల మిత్ర ప్రణీత్, సిబ్బంది మల్లయ్య, షకీల్, గొర్రెల యజమానులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడాదుస్తుల వితరణ


క్రీడాదుస్తులతో విద్యార్థులు

మోర్తాడ్, నవంబర్ 4: మండలంలోని సుంకెట్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఇటీవల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికవగా.. వారికి రూ.6వేల విలువ గల క్రీడాదుస్తులను సర్పంచ్ శ్రీనివాస్ వితరణగా ఇచ్చారు. ఈ మేరకు క్రీడా దుస్తులను శనివారం అందజేయగా.. సర్పంచ్‌కు ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## భీమ్‌గల్ లో వారాంతపు సంత రద్దు

భీమ్‌గల్,నవంబర్ 4: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయం చుట్టు పక్కల 144 సెక్షన్ అమలుచేస్తున్నారు. దీంతో ఈ నెల 6న జరగాల్సిన వారాంతపు సంతను రద్దు చేస్తున్నట్లు భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్ శనివారం ఒక ప్రకనటలో తెలిపారు. సంతకు వచ్చే వారు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## బాధితుడికి ఫోన్ అందజేత

మెండోరా, నవంబబర్ 4 : మండలంలోని చాకిర్యాల్ గ్రామానికి చెందిన తోకల లింబాద్రి సెల్‌ఫోన్ పోయిందని కొన్ని రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై జి.శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ దొరకడంతో బాధితుడు లింబాద్రికి సెల్‌ఫోన్‌ను శనివారం అందజేసినట్లు పేర్కొన్నారు.


బాధితుడికి మొబైల్‌ను అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్ యాదవ్